# దీపం వెలుగుతూనే ఉంది

డాబా అంచు పొడవునా వేళ్ళాడదీసిన రంగు రంగుల బల్బులు, చిత్ర వర్ణాలతో మెరిసిపోతూ, వివిధ మతాలతోనూ సంస్కృతులతోనూ శోభిల్లుతూన్న భారతదేశానికి ప్రతీకలుగా, రంగుల తోరణాల్లా వెలిగిపోతున్నాయి. ఆ రంగు బల్బుల కాంతి, డాబా ముందున్న ఖాళీస్థలంలో అందంగా పెట్టిన తెల్లని ముగ్గుల మీదపడి, అహింసామూర్తి చిరునవ్వులా, జిగేల్ మంటోంది. ఆ ముగ్గులమధ్య, సగటు భారతీయుని వజ్రసంకల్పంలా నిటారుగా సగర్వంగా నిలబడివుంది పతాక ధ్వజం. ఆ ధ్వజం చివర ఎగురుతూన్న యూనియన్ జాక్‌ని దింపేసి, దాని స్థానంలో కొద్ది క్షణాల్లో ఎగరవేయవలసిన త్రివర్ణ పతాకాన్ని చేత్తో పట్టుకుని నుంచున్నాడు సుందరం. అతని పక్కనే ముగ్గులమధ్య ముచ్చటగా కూర్చుని, చిన్న మట్టి ప్రమిదలో దీపం వెలిగించబోతోంది జయలక్ష్మి. డాబా మీంచి పడుతూన్న వివిధ రంగుల కాంతుల్నీ, నేలమీద నవ్వుతూ పరుచుకొని ఉన్న అందమయిన ముగ్గుల్నీ, ధ్వజం చివరకి వెళ్ళి ఎప్పుడు సంతోషంగా పరుచుకుందామా అని తహతహలాడుతూ సుందరం చేతిలో చల్లని గాలికి రెపరెపలాడుతూ రెక్కలు కొట్టుకుంటూన్న మూడు రంగుల జండానీ, ఎంత గాలిలో అయినాసరే ఆ చిన్న దీపాన్ని వెలిగించితీరాలని పట్టుదలగా ప్రయత్నిస్తూన్న జయలక్ష్మి కళ్ళనీ వింతగా చూస్తూ అటూ యిటూ బుజ్జి బుజ్జి అడుగులువేస్తూ కదులుతున్నాడు లజపతి. ముగ్గులమధ్య నడుస్తూ మెరిసిపోయ్యే కళ్ళతో రంగు దీపాల్నీ రంగురంగుల జండానీ చూస్తూ చప్పట్లు కొడుతూన్న కొడుకుని చూసి మురిసిపోసాగాడు సుందరం

రహస్యంగా "జయా! జయా!'' అని పిలిచి, "వాణ్ణి చూడు, వాడెలా సంతోషంగా కేరింతాలు కొడుతున్నాడో!'' అన్నాడు.

జయలక్ష్మి అటోమారు చూసి నవ్వుకుని, "అవునండీ! దేశానికి స్వరాజ్యం వస్తోందన్న సంతోషం అంతా వాడి కళ్ళల్లోనే కనిపిస్తోంది" అంది.

సుందరం వాచీ చూచుకుని ''సరిగ్గా ఇంకొక్క పావుగంటలో మనవాళ్ళ ఇంగ్లీషువాళ్ళ దగ్గర్నుంచి ప్రభుత్వాన్ని స్వీకరిస్తారు'' అన్నాడు, సంతోషంవల్ల బొంగురుపోయిన కంఠంతో.

ఆ మాటలు జయలక్ష్మికి యెంతో శ్రావ్యంగా వినిపించాయి. ఆమె కనులు సంతోషంతో వెలిగిపోయాయి.

"ఇంకా కొద్దిక్షణాల్లో దేశం యావత్తూ స్వాతంత్ర్య కాంతులతో నిండిపోతుంది. తరతరాలుగా దాస్యంలో మగ్గివున్న భారతజాతి నవ చైతన్యంతో పులకిస్తుంది. ప్రతి భారతీయుని హృదయంలోనూ విజయ ఘంటికలు మ్రోగుతాయి."

జయలక్ష్మికి ఆ ఉత్తేజకరమయిన పలుకులు వింటూంటే ఒళ్ళంతా గగుర్పొడిచింది. "అబ్బా, ఇవి ఎంత మధురమైన క్షణాలండీ! ఈ క్షణాలకోసమే కదా మనం ఇన్నియేండ్లుగా తపస్సు చేస్తూన్నది?" అంది, ఆనందంతో వచ్చిన కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"జయా! మనకంటే లఖపతి అదృష్టవంతుడు కదూ?" అన్నాడు సుందరం నవ్వుగా.

"అవునండీ - వాడు హాయిగా స్వేచ్ఛగా స్వాతంత్ర్య భారత పౌరుడుగా ఎదుగుతాడు. మీరీ వ్యాపార వ్యవహారం యేదో చప్పున తెమిల్చేసుకుంటే, మనం తిరిగి కలకత్తా వెళ్ళిపోదాం."

"కలకత్తా ఎందుకు? ఇంక మనం ఢిల్లీయే వెళతాం అయిదారు నెలలు పోతే - అక్కడే ఉండిపోవచ్చు. మన కంపెనీకూడా అక్కడికే మార్చేస్తాను."

"నిజంగా?!" ఆత్రుతగా అతనికేసి చూస్తూ అడిగింది జయలక్ష్మి.

ఆమె ముంగురులు వేళ్ళతో వెనక్కినెట్టి నుదుటిమీద ముద్దుపెట్టుకుంటూ "పిచ్చి జయా! ఢిల్లీ అంటే యెందుకు నీకింత అభిమానం?" అన్నాడు సుందరం.

చిరుకోపంతో "అదేవిటండీ! మన దేశం అన్నా, మన రాజధాని అన్నా ఆప్యాయత ఉండదా యేమిటి?" అంది జయలక్ష్మి.

"నిజమే....ఇప్పుడు మనం ఇలా 'నౌఖాళీ'లో ఉండిపోయాం కనక కాని, ఇదే ఢిల్లీలో వుంటేనా? ఏం సంతోషం, ఏం సంబరం? ఓహ్! ఆ కోలాహలం, ఆ ప్రజా సందోహం ఆ స్వాతంత్ర్యోత్సవ సంరంభం, ఎలా ఉండేదనీ!"

ఉన్న ఊరు పేరు జ్ఞాపకం చేసేసరికి, జయలక్ష్మికి వెన్నులోంచి చలి గాలిలా భయం జివ్వుమంటూ పరిగెట్టింది. ఇప్పటికి దాదాపు రెండు మూడు నెలలనుంచీ యీ నౌఖాళీలో హత్యలు, దోపిడీలు, పరుగులు, కేకలు, అల్లర్లు, మంటలు, ఏడుపులు - ఇవేగా తను చూస్తున్నది! ఆమె ఒక్క మారు నిలువెల్లా వణికిపోయింది.

తటాలున వెళ్ళి, పక్కని తిరుగుతూన్న 'లజపతి'ని తీసుకుని గుండెలకి హత్తుకుని, "ఏమండీ! లోపలికి పోదాం రండి. నాకేదో భయంగా వుంది" అంది.

''భయం ఎందుకు?. ..'' అన్నాడు నవ్వుతూ సుందరం.

బేలగా ముఖంపెట్టి ''ఊరి పరిస్థితి చూస్తున్నాం కదా?.... బయట ఎందుకు? లోపలికి పోదాం రండి'' అంది జయలక్ష్మి.

''ఊళ్ళో బాపూజీ ఉన్నారు, ఏం ఫరవాలేదు'' అన్నాడు సుందరం తాపీగా.

ఇంతలో ఒగుర్చుకుంటూ 'ముస్తఫా' అక్కడికి పరిగెత్తుకుని వచ్చాడు.

అతని ఒళ్ళంతా వణికిపోతోంది....

భయంతో పదేపదే వెనక్కి చూస్తున్నాడు.

కళ్ళల్లో భీతి, దైన్యం, కంగారూ!

చెమటతో ఒళ్ళంతా తడిసిపోయింది. ఊపిరి అందక గుండెలు కొట్టు కుంటూంటే తెగ కళవళపడుతున్నాడు.

''ఏమిటి ముస్తఫా! ఏవిటీ కంగారు? ఎక్కడనుంచి ఇలా పరిగెత్తుకుని వస్తున్నావు?'' అన్నాడు ఆదుర్దాగా సుందరం. లజపతిని ఇంకా దగ్గరగా గుండె లకి హత్తుకుని భీతిగా చూస్తూ దూరంగా నిలబడి వుంది జయలక్ష్మి.

''పంచెకట్టులూ బొట్టులూ వున్న ఆసాములు నన్నూ నా గళ్ళ లుంగీనీ బోడితలనీ బిరుసుగెడ్డాన్నీ చూసి, 'ఒరేయ్! వీడిని కొట్టండి, చంపండి' అంటూ తరుముకొస్తున్నారండీ!'' అన్నాడు ఒణికిపోతున్న రుద్ధకంఠంతో.

''నీకేం ఫరవాలేదు, నువ్విలా నిలబడి వుండు వాళ్ళొస్తే నేను మాట్లా డుతా'' అన్నాడు దృఢమైన కంఠంతో సుందరం.

''బాబోయ్! నన్ను చూస్తే బతకనివ్వరు. మీరు అడ్డుకొనే లోపుగానే చంపేస్తారు'' అంటూ ఘొల్లుమన్నాడు ముస్తఫా.

"అయితే, నువ్వలా మా యింట్లోకి వెళ్ళు. వాళ్ళ సంగతి నేను చూసు కుంటాను'' అన్నాడు సుందరం.

ముస్తఫా చెంగున ఒక్క గంతులో లోపలికి ఉరికి, గడియ వేసు కున్నాడు.

జయలక్ష్మి గతుక్కుమంది. ''ఇదేమిటండీ! అతను లోపలికి వెళ్ళి గడియవేసుకుంటే. మన పనో? మనం లోపలికి యెలా వెళ్ళడం?'' అంది ఆతురతగా.

సుందరం యేదో చెప్పబోయాడు.

ఇంతలో బిలబిలమంటూ పాతికమంది జనం పరిగెత్తుకు వచ్చారు. వాళ్ళని చూస్తూనే భయపడిపోయి పతాక ధ్వజానికి కరుచుకుపోయింది జయ. లజపతి అమ్మ గుండెలకి అంటుకుపోయి, ఏమౌతుందో అర్థంకాక బిక్క మొహం వేసుకుని చూస్తున్నాడు.

వచ్చిన జనం యిటూ అటూ అస్థిమితంగా త్రొక్కిసలాడుతూ పంచె కట్టుకుని వున్న సుందరాన్నీ, చీరలో వెలుగుతున్న జయలక్ష్మినీ యెగాదిగా పరిశీలనగా ఒకటి రెండుసార్లు చూసి ''ఏమండీ! ఇక్కడకెవరేనా పరిగెత్తుకుని వచ్చారా?'' అన్నారు.

తన చేతిలో ఎగుర వెయ్యడానికి సిద్ధంగావున్న జండాని భార్య చేతికి ఇచ్చి ''మీకు ఎవరు కావాలి?'' అంటూ వాళ్ళని సమీపించాడు, సుందరం.

వాళ్ళంతా ఒక్కమారుగా ఏదో అరిచారు, ఆవేశపూరితమయిన కంఠా లతో.

"అయ్యా.... ఎవరో ఒకరు చెప్పండి ఇంతమంది చెబితే ఎలా?'' అన్నాడు సుందరం.

అందులో ముందునుంచున్న యువకుడు తక్కిన వాళ్ళనందరినీ ఊరు కోండని హెచ్చరించి, "తాము ఒక వ్యక్తిని తరుముకొని వస్తున్నామనీ, అతడు ఈ యీ రూపంలో ఉంటాడనీ ''సూచించి, అలాంటి వ్యక్తి ఎవరైనా వచ్చాడా అని అడిగాడు.

"ఎందుకు? అతను దొంగతనం కాని, హత్య కాని చేశాడా?'' అని అడిగాడ సుందరం.

"అదంతా మీకు అనవసరం.... వచ్చాడా, లేదా- చెప్పండి'' అంటూ గట్టిగా అరిచారు చుట్టూ మూగిన జనం.

సుందరం ఏం మాట్లాడలేదు.

వాళ్ళలో కలకలం బయలుదేరింది. 'వాడిటు రాలేదేమో!' అనుకున్నారు కొందరు. ''వచ్చాడు, మేం చూస్తేనే!'' అంటూ అరిచారు మరికొందరు ''మరి అయితే ఏమయ్యాడు?''

''ఈయన చూడలేదేమో!''

''చూసే వుంటాడు.... చెప్పడంలేదు.''

ఇలా వాళ్ళలో వాళ్ళు అరుచుకుంటూ సమాధానాలు చెప్పుకుంటూ కాస్సేపు అటూ యిటూ తచ్చాడి, చివరికి మౌనంగా నిలబడివున్న సుందరాన్ని అనుమానంగా చూసి, విసుక్కుంటూ అక్కడినుంచి కదిలి వెళ్ళిపోయారు.

ఒక్క నిముషం వూరుకొని ఆ తర్వాత దీర్ఘంగా నిట్టూర్చి 'చివరికి దేశ విభజనవల్ల వచ్చిన లాభాలు ఇవి! ఇన్నాళ్ళూ ఒకే జాతిగావున్న ప్రజలు, ఇప్పుడు రెండు జాతులం అనుకుంటున్నారు' అంటూ తనలో తను అనుకున్నట్లు గట్టిగా అన్నాడు సుందరం.

పెద్ద భారం తీరినట్లు స్థిమితపడి, ''అంతా చిందర వందర అయి పోయింది. ముగ్గు అంతా యెలా తొక్కేశారో!'' అంది జయలక్ష్మి బాధగా.

''ముగ్గుకేం లే? మనిషి ప్రాణం నిలబడింది!'' అంటూ సుందరం వెనక్కి తిరిగి "ముస్తఫా....ముస్తఫా....'' అంటూ తలుపు తట్టాడు. సమాధానం లేదు. గట్టిగా పిలిచాడు. ఉహూ....లాభం లేదు....

''అదేవిటండీ! లోపల వుండి తలుపు తియ్యడేం?'' అంది జయలక్ష్మి గాభరాగా.

''సర్లే.... ఆ సంగతి తర్వాత చూద్దాం, ముందు ఆ ప్రమిద వెలిగించు. నేను జండాఎగరవేస్తాను, పన్నెండుకావస్తోంది'' అన్నాడు సుందరం వాచీచూసి.

లజపతిని పక్కని దింపి, జయలక్ష్మి దీపం వెలిగించే ప్రయత్నంలో వుంది.

సుందరం యూనియన్ జాక్ దింపి, దాని స్థానంలో త్రివర్ణ పతాకాన్ని ఎగరవేస్తున్నాడు.

సరిగ్గా ఆ సమయంలో, నలభై ఏభై మంది "అల్లాహో అక్బర్!" అని అరుస్తూ అక్కడికి వచ్చి సుందరాన్ని చుట్టుముట్టారు. అది చూసి జయలక్ష్మి భయంతో వణికిపోయి, లజపతిని దగ్గరగా తీసుకుని దూరంగా వెళ్ళి నిలబడింది.

అందులో ఒకడు సుందరం బుజంమీద కర్కశంగా చెయ్యివేసి "ఏయ్! ముస్తఫాని యెక్కడ దాచావు?" అన్నాడు.

"ఇందాకా వాళ్ళు వెళుతూ చెప్పుకుంటూంటే మేం విన్నాంలే. నువ్వు దాచావటగా ముస్తఫాని?" అన్నాడు ఇంకొకడు.

సుందరం ఏదో నెమ్మదిగా సమాధానం చెప్పబోయాడు.

"కబుర్లు కనిపెట్టు. నువ్వు బతకదలుచుకుంటే ఎక్కడ దాచావో చెప్పు" అంటూ ఇంకొకడు కర్ర ఎత్తాడు. "అలా మెత్తగా అడిగితే చెప్తాడా?....తంతే కాని చెప్పడు" అన్నాడు మరొకడు.

"అయితే తన్నండి."

"మారో!.... మారో!"

జనం పిచ్చిగా కేకలేస్తున్నారు.

కోపంతో ఊగిపోతున్నారు.

సుందరంమీదికి కర్రలు ఎత్తుతున్నారు.

కత్తులు చూపిస్తున్నారు.

ఆ భయంకర దృశ్యం చూసి కెవ్వున అరిచి స్పృహతప్పి పడిపోయింది జయలక్ష్మి. 'అమ్మా....అమ్మా....' అంటూ ఆమె మీదపడి ఏడుస్తున్నాడు లజపతి.

రంగు బల్బుల కాంతి జాలిగా పడుతోంది.

చెరిగిపోయిన ముగ్గులు దీనంగా చూస్తున్నాయి.

ప్రమిదలో దీపం, గాలికి రెపరెప లాడుతోంది.

సుందరం ఎగరేసిన స్వాతంత్ర్య పతాకం, జండా కర్ర చివర ఆవేదనతో ఎగురుతూ, అవ్యక్తమైన చప్పుడు చేస్తోంది.

ఇంకొక్క క్షణం అయితే, సుందరం నెత్తిమీద కర్రలు వచ్చిపడేవే.... గుండెల్లో బాకులు గుచ్చుకునేవే....

కాని ఇంతలో, ఆ గుంపుకి నాయకుడయిన ఓ యువకుడు ''ఆగండి!" అని గర్జించాడు.

అంతే!

ఎక్కడివాళ్ళక్కడ ఆగిపోయారు.

''ముస్తఫాని ఎందుకు బంధించావు?" ఆ యువకుడు గర్జించి అడిగాడు.

''నేను బంధించలేదు... అతనే నా ఆశ్రయం కోరాడు. అదిగో....ఆ యింట్లోకి వెళ్ళి దాగుకున్నాడు. అది నా యిల్లు. లోపల గడియ పెట్టుకున్నాడు కూడా....నేను బంధిస్తే బయట గొళ్ళెం పెట్టి తాళం వెయ్యనూ?" అంటూ సౌమ్యంగా వివరించి చెప్పాడు సుందరం.

అతనికేసి అనుమానంగా చూసి ''ఊ....అయితే, నీ మాటలు నమ్మమంటావు?....సరే....ఒరేయ్! మీరంతా ఇతణ్ణి పట్టుకుని వుండండి పారిపోకుండా.... నేను లోపలికి వెళ్ళి చూచివస్తాను'' అంటూ ఆ యువకుడు తనతో యిద్దరు ముగ్గుర్ని తీసుకుని సుందరం ఇంటిదగ్గరికి వెళ్ళి తలుపు తట్టాడు. ఎంతకీ సమాధానం రాకపోయేసరికి దగ్గరున్న గునపాలతో తలుపులు ఎత్తేశారు.

అన్యాయం నుండి న్యాయాన్ని, అధర్మం నుంచి ధర్మాన్ని, అసత్యం నుంచి సత్యాన్ని రక్షించే కవచాలులా ఇన్నాళ్ళనుంచీ నిలబడివున్న ఆ తలుపులు ఫెళ్ళున వెనక్కి పడిపోయాయి.

వాళ్లు గదులన్నీ వెతికారు. మూల మూలలా శోధించారు. ఇల్లంతా గాలించారు చివరికి పెరట్లోకి కూడా వెళ్ళిచూశారు. పెరటి తలుపులు బార్లాతీసి ఉన్నాయి.

ముస్తఫా మాత్రం యెక్కడా కనిపించలేదు. వాళ్ళ కోపం తారస్థాయిని చేరింది. తిరిగి వస్తూనే ''ఏమిరా, మమ్మల్ని మోసం చేస్తావా?'' అంటూ కసితీరా సుందరం నెత్తిమీద కర్రలతో కొట్టారు.

''అమ్మా!" అంటూ అతను నేలమీదకి ఒరిగిపోసాగాడు. ఒరిగిపోతూన్న సుందరంమీద తలొకరూ తలో దెబ్బా వేశారు.

సుందరం తల చిట్లిపోయింది.

ఒళ్ళంతా గాయాలతో విచ్చిపోయింది.

రక్తపుమడుగులో మాంసపుముద్దలా పడిపోయాడు సుందరం

ఆ గుంపులో ఒకడి దృష్టి దూరంగా పడివున్న జయలక్ష్మిమీద పడింది. "అదిగోరా పిడి బీబీ" అన్నాడు. అంతే! అంతా అటు పరుగెట్టారు. కాళ్ళకి అడ్డంవచ్చిన లజపతిని రెక్కపట్టుకుని విసిరివేశారు. లజపతివచ్చి వెలుగుతూన్న దీపం పక్కని పడ్డాడు. స్పృహలేకుండా పడిపోయిన లజపతి శరీరం, గాలి తాకిడినుండి దీపాన్ని రక్షించింది అప్పటిదాకా గాలికి రెపరెపలాడుతూన్న దీపం, లజపతి శరీరం అడ్డురావడంతో నిశ్చలంగా వెలుగసాగింది. హోరుమని వీస్తున్న గాలి దీపాన్ని ఏం చెయ్యలేకపోతోంది.

గుంపులోవున్న జనం కొందరు, సుందరాన్ని నెత్తురుమడుగులోంచి లేవదీసి జండాకొయ్యకి తాళ్ళతో కట్టసాగారు. అది చూచి మరికొందరు జయలక్ష్మిని కూడా తీసుకువచ్చి అతనితోపాటు ఆ కొయ్యకే కట్టేశారు అందులో ఒకడు, కిందపడియున్న యూనియన్ జాక్‌ని తీసి దీపం చివర ముట్టించి, దాని సాయంతో జయలక్ష్మి, సుందరంల బట్టలు అటించి, వాళ్ళని సజీవదహనం చెయ్యాలని సంకల్పించారు అందుకోసం యూనియన్ జాక్‌ని నేలమీంచి తీశాడు కూడా.

లజపతి పొట్టలో పేగు కదిలింది.

ప్రమిదలోని దీపం కంట్లోంచి రెండు నూనెబొట్లు రాలాయి.

జాతీయ పతాకం గాలిలో విలవిల్లాడింది. డాబామీది రంగులబల్బులు కాంతివిహీనం అయ్యాయి.

అంతే! ఉన్నట్టుండి "ఈశ్వరఅల్లా తేరేనామ్" అంటూ కొన్ని వేల కంఠాల మేఘగర్జన దగ్గరగా వినిపించింది.

కొన్ని లక్షల అడుగులు, దృఢంగా నేలమీదపడుతూ క్రమేపీ దగ్గరవుతూ వినిపించాయి.

కంఠాలూ....అడుగులూ....గంభీరంగా ... దృఢంగా వేలూ ....లక్షలూ.... కంఠాలు....అడుగులూ....ఒక మహా చైతన్య ప్రవాహం, ఒక దీక్షా దక్ష మహా ప్రవంతి, వడిగా వడివడిగా వచ్చేస్తోంది.

వచ్చేసింది. దగ్గరగా వచ్చేసింది. ఆ మహా ప్రవాహాన్ని చూసేసరికి, సుందరాన్ని జయలక్ష్మినీ దహించి వెయ్యడానికి పూనుకొన్న మూకకి యేం చెయ్యాలో తోచలేదు. కాలూ చెయ్యీ ఆడలేదు....కంగారు....అదుర్దా.... తలకొకరీతిగా కకావికలై పారిపోయారు.

చైతన్య మహా ప్రవంతిని తనతో నడిపించుకొనివచ్చిన ముస్తఫా, జండా కర్ర మొదట్లో, కట్లతో స్పృహకోల్పోయి పడివున్న సుందరాన్నీ జయలక్ష్మినీ చూచి కుప్పకూలినట్లు కూలిపోయాడు. దూరంగా పడివున్న లజపతి కెవ్వు మన్నాడు.

కాస్సేపటికి తెలివివచ్చిన సుందరం, జయలక్ష్మి కళ్ళు తెరిచి యిటూ అటూ ఆదుర్దాగా చూశారు. వాళ్ళ ఆవేదన గమనించి, వెంటనే లజపతిని తీసుకు వచ్చి వాళ్ళదగ్గర వుంచాడు ముస్తఫా.

భావితరానికి ఆశాంకురంగా కనిపించిన లజపతిని చూసి తృప్తిగా నిట్టూర్చి అతని చేతిని ముస్తఫా చేతిలో ఉంచి, ఆఖరిసారిగా గుండెలనిండా శ్వాస పీల్చుకున్నారు, సుందరం జయలక్ష్ములు.

ముస్తఫా ఘొల్లుమన్నాడు. లజపతి యేడుస్తూ వాళ్ళమీద వాలి పోయాడు.

పెద్ద వృక్షాలు ఒరిగిపోయినా చిన్న మొక్క నిలిచే ఉంది!

అవాంతరాలు యెన్ని ఏర్పడినా జాతీయ జండా ఎగురుతూనే వుంది!

రక్తపుటేరులు ప్రవహించి ముగ్గులు చెరిగిపోయినా దీపం వెలుగుతూనే వుంది!

భావితరానికి ఆశాజ్యోతిలా, భవిష్యత్తు గురించి బంగారు కలలుకంటూ, మణిదీపంలా ఎదుగుతూనే వున్నాడు స్వాతంత్ర్య భారత భావిపౌరుడు- చిన్నారి లజపతి హృదయంలో.

ఆ మణిదీపమే మృతవీరుల స్మృతికోసం నింగినీ నేలనీ కాంతిమయం చేసే కార్తీకదీపంలా, ఆరని జ్యోతి అయి ప్రకాశిస్తోంది. అదే దేశానికి ఆరని జ్యోతి. ఆ జ్యోతి వెలుగుతూనే ఉంటుంది. ఎప్పటికీ అది ఆరని ఆశాజ్యోతి! *